
కొలువుదీరిన దుర్గమ్మ 2

2 డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం



రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో రోడ్డునపడ్డ రైతులు 2

www.aksharatoday.com
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND



సందర్భం ఏదైనా అక్షరటుడేను చేసుకోండి వేదిక..
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు, అక్షరటుడే డిజిటల్ దినపత్రికలో ప్రకటనల ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి.
వివాహ, పదవీ విరమణ, అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి, జన్మదిన శుభాకాంక్షలు, క్లాసిఫైడ్స్ తదితర యాడ్స్ కోసం వెంటనే సంప్రదించండి..
ఇందుకోసం సంప్రదించాల్సిన నంబర్లు..
7842240200, 9392184443



4-10-2024 (FRIDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2


# పీసీసీ చీఫ్ సభకు భారీ ఏర్పాట్లు..

- నేడు తొలిసారిగా జిల్లాకు రానున్న మహేశ్ కుమార్ గౌడ్
- పాత కలెక్టరేట్ మైదానంలో స్వాగత సభ



**అక్షరటుడే, ఇందూరు:** టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం మొదటిసారి జిల్లాకు రాబోతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో భారీ సభ నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఆయనకు అడుగడుగునా ఘనస్వాగతం పలికేందుకు సన్నాహాలు చేశారు.

### షెడ్యూల్ ఇదే..

శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భారీ ర్యాలీగా మాధవనగర్ చేరుకుంటారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం 1.30 గంటలకు బోర్గాం కమాన్ నుంచి ర్యాలీగా బయలుదేరి పులాంగ్, హైదరాబాద్ రోడ్డు, ఎల్లమ్మగుట్ట చౌరస్తా మీదుగా పాత కలెక్టరేట్ మైదానానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు.



మహేశ్‌కుమార్‌గౌడ్ రాక నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

### విజయవంతం చేయాలి: మానాల

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ స్వాగత సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి కోరారు. గురువారం సభా ప్రాంగణం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభ కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని, వాహనాల పార్కింగ్‌కు వేర్వేరుగా మూడు స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసులను కోరారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, నరాల రత్నాకర్, నగేష్ రెడ్డి, జావేద్ అక్రం, శేఖర్ గౌడ్, విక్కీ యాదవ్, వేణు రాజ్, బొబ్బిలి రామకృష్ణ, విపుల్ గౌడ్ పాల్గొన్నారు.









## శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 26,549 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే మొత్తంలో అవుట్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా అంతే నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.



## ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

**అక్షరటుడే ఇందూరు:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పదో తరగతి తెలుగు పరీక్షలో 52 మంది అభ్యర్థులకు గాను 41 మంది హాజరయ్యారు. ఇంటర్ తెలుగు పరీక్షకు 81 మందికి గాను 57 మంది ఎగ్జామ్ రాశారు.














ముబారక్‌నగర్‌లోని భూలక్ష్మి ఆలయంలో..



బోధన్‌లో..



బాన్సువాడలో..



ఆర్మూర్‌లో ..

# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా వాడవాడల్లో వెలిసిన మండపాల్లో గురువారం అమ్మవారు కొలువు దీరారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు తొమ్మిది రోజుల దీక్షలు చేపట్టారు. అమ్మవారు తొమ్మిది రోజుల్లో వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. –అక్షరటుడే, నెట్‌వర్క్



బాల్కొండలో..



దోమకొండ మహంకాళి ఆలయంలో..



జుక్కల్‌లో..



కామారెడ్డిలో మాలధారణలో స్వాములు..

## నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

**అక్షరటుడే, నిజామాబాద్‌అర్బన్:** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ శుక్రవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. పలు మార్గాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. పాత కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భారీ బహిరంగ సభ కారణంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లించినట్లు పోలీసులు తెలిపారు.

- నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను ఫ్లై ఓవర్ మీదుగా శ్రద్ధానంద్ గంజ్, అర్సపల్లి ఎక్స్ రోడ్, బోధన్ వైపుగా మళ్లించారు.
- బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి ఎక్స్ రోడ్, కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్ మీదుగా బస్టాండ్‌కు మళ్లించారు.
- బోధన్ వైపు వెళ్లే భారీ వాహనాలు మధ్యాహ్నం మాధవనగర్, కంఠేశ్వర్ బైపాస్, కొత్త కలెక్టరేట్, అర్సపల్లి ఎక్స్ రోడ్, బోధన్ వైపు వెళ్తాయి.
- బోధన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే భారీ వాహనాలు అర్స పల్లి ఎక్స్‌రోడ్, కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్, మాధవనగర్ మీదుగా వెళ్లాలి.
- బాన్సువాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు వర్ని చౌరస్తా, ఖిల్లా రోడ్, బోధన్ బస్టాండ్, అర్సపల్లి ఎక్స్ రోడ్, కొత్త కలెక్టరేట్, కంఠేశ్వర్ బైపాస్, మాధవనగర్ వైపు వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## నగరాభివృద్ధికి నిధులివ్వాలి: ధన్‌పాల్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. నగరంలోని 20, 16వ డివిజన్లలోని కంఠేశ్వర్, బ్యాంక్ కాలనీల్లో సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ ఫండ్ కింద ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 14వ, 15వ ఆర్థిక సంఘం బకాయిలు చెల్లించని కారణంగా కేంద్ర ప్రభుత్వ నిధులు కూడా ఆగిపోయాయన్నారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు న్యాలం రాజు, పంచరెడ్డి ప్రవళిక, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## క్రిమినల్ కేసులు నమోదు చేయాలి




**అక్షరటుడే, నిజామాబాద్ రూరల్:** తెలంగాణ యూనివర్సిటీకి చెందిన భూమిని కబ్జా చేయాలని చూస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెయూ భూములను కాపాడాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెయూకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 578 ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు హైకోర్టులో కేసు వేసి అక్రమంగా భూకబ్జాలకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్, రవీందర్, శివసాయి, వంశీ, రాకేశ్, స్రవంతి, రచన, గౌతమి, ప్రియా, రమ్య తదితరులు పాల్గొన్నారు.


## లింగంపేటలో రోడ్డెక్కిన అన్నదాతలు



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రైతులను రోడ్డుమీదకు తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ విమర్శించారు. షరతులు లేకుండా రైతు రుణ మాఫీ చేయాలని లింగంపేటలో అన్నదాతలు గురువారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో రైతులను ధనవంతులను చేస్తే.. ప్రస్తుతం రేవంత్ రెడ్డి రోడ్లమీదకి తీసుకొచ్చారని విమర్శించారు. లింగంపేట మండల కేంద్రంలో 3,300 మందికి రుణమాఫీ కావాల్సి ఉండగా.. కేవలం 1,400 మందికి మాత్రమే అయిందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను నెరవేర్చకపోతే ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్ గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు దివిటి రమేష్, సంజీవరెడ్డి, ముదాం సాయిలు, బొల్లు శ్రీకాంత్, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, దాసరి పర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా శ్రీకాంత్



నూతన చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా పద్మ శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్డీవో మన్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 12 మంది సభ్యులుండగా.. ఎనిమిది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో హోదాలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరయ్యారు. కాగా.. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు పద్మ శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన్ను ఎమ్మెల్యే సన్మానించారు. అయితే పద్మ శ్రీకాంత్ ఇటీవలే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

## చోరీకి యత్నం.. పట్టుకున్న స్థానికులు

**అక్షరటుడే, బోధన్:** ఆలయంలో దొంగలు చోరీకి యత్నించగా.. స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన బోధన్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని బైపాస్ ప్రాంతంలో గల బొర్ర గణేశ్ మందిరంలో చోరీ చేసేందుకు బుధవారం అర్ధరాత్రి ముగ్గురు నిందితులు గేటు తాళం పగులగొడుతుండగా స్థానికులు గమనించారు. వారు వెంటనే ఆలయానికి చేరుకోగా ఇద్దరు నిందితులు పరారయ్యారు. కాగా మరొకరు పట్టుబడడంతో అతడికి దేహశుద్ధి చేశారు. నిందితులను వెంటనే పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

## డీసీఎం ఢీకొని.. యువకుడికి తీవ్రగాయాలు

**అక్షరటుడే, ఆర్మూర్:** బైకును డీసీఎం ఢీకొట్టిన ఘటన ఆర్మూర్ మండలం మామిడిపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఆలూరు మండలం కల్లెడకు చెందిన ప్రసాద్ గురువారం మధ్యాహ్నం బైకుపై ఆర్మూర్‌వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ఆర్మూర్‌కు తరలించారు. కాగా.. డీసీఎం డ్రైవర్ ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు.



నిజామాబాద్ రూరల్ మండలంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్



నగరంలోని 38వ వార్డులో మున్సిపల్ కమిషనర్..

## డిజిటల్ కార్డుల సర్వే..



బోధన్‌లోని లంగ్డాపూర్‌లో సబ్ కలెక్టర్..



నిజామాబాద్‌లోని గూపన్‌పల్లిలో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా అధికారులు సర్వే ప్రారంభించారు. ప్రతి కుటుంబం హెల్త్ ప్రొఫైల్ రూపొందించి యూనిక్ నెంబర్‌తో కూడిన కార్డులను జారీ చేయనున్నారు.

- అక్షరటుడే, నెట్‌వర్క్